గ్రామాల్లో 'చెత్త' పాలన

క్షీణించిన పారిశుద్ధ్యం

- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- గ్రామాలలో దండయాత్ర చేస్తున్న దోమలు
- నామమాత్రంగా 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు
- రోగాల బారిన ప్రజలు



నందిరాజుపాలెంలో రోడ్డుపై నిలిచిపోయిన మురుగు నీరు

బెల్లంకొండ: పల్లెల్లో పాలన పడకేసింది. కొద్దిపాటి వర్షానికి అడుగు వేసే పరిస్థితి లేదు. మురుగు రోడ్ల పైనే పేరుకుపోయింది. ఎక్కడి చెత్త అక్కడే ఉంది. రోజుల తరబడి చెత్త సేకరించడం లేదు. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎటూ చూసినా సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పూడికతో నిండిన డ్రెయిన్లు....

గ్రామాలలో డ్రెయిన్లు చెత్తా చెదారాలతో నిండి పోయి పూడిక ఏర్పడ్డాయి. దీంతో కాలువలలో మురుగు నీరు ప్రవహించడం లేదు. మురుగు నీరంతా నిల్వ చేరి ఉండడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య లోపంతో ఈగలు, దోమలు ప్రబలుతున్నాయి. దీంతో రాత్రి సమయాలలో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది.

కనిపించని పారిశుద్ధ్య చర్యలు.....

గ్రామాలలో పారిశుద్ధ్య అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టక పోవడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెలల నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నామమాత్రంగానే నిర్వహించారు. గ్రామాలలో ఫాగింగ్ చేయాల్సి ఉండగా ఇంతవరకూ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

అధ్వానంగా పారిశుద్ధ్యం...



పాపాయపాలెం బీసీ కాలనీలో మురుగుతో నడవడానికి వీలు లేకుండా రోడ్డు

మండలంలో 11 పంచాయతీలలో 13 గ్రామాలు ఉన్నాయి. కాగా కొంతకాలంగా గ్రామాలలో ఎక్కడా పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. వీధులలో పెరుగుతున్న పిచ్చి మొక్కలు, గృహాల మధ్య పేరుకుపోతున్న చెత్త చెదారాల తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు గ్రామాలలో వినిపిస్తున్నాయి. మండలంలోని బెల్లంకొండ మండల కేంద్రంతో పాటుగా పాపాయపాలెం, చంద్రాజుపాలెం, నందిరాజుపాలెం, మన్నెసుల్తాన్ పాలెం, వెంకటాయపాలెం, కందిపాడు గ్రామాలు అధ్వానంగా తయారయ్యాయి. సైడు కాలువలు లేక పోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నీరంతా రోడ్లపైకి చేరుతోంది. వర్షపు నీరు కూడా రోడ్ల మీదకు వచ్చి చేరుతుండడంతో రోడ్లన్నీ పంట కాలువలను తలపిస్తున్నాయి. మురుగు కాలువలు పూడి పోయి మురుగునీరు అంతా రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగు, చెత్త దోమల సంతతికి నెలవుగా మారుతుంది. దీనితో గ్రామాలలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

మురుగు నీరు రోడ్లపైనే..

మా గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. డ్రెయినేజీ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కాలువలలో పూడిక ఏర్పడి మురుగు నీరు ప్రవహించడం లేదు. కాలువలు నిండి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది ఇబ్బందులు పడుతున్నాం.

– రుద్రపాటి హుస్సేన్, నందిరాజుపాలెం

ఎటు చూసినా అపరిశుభ్రతే

మా గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత దర్శనమిస్తుంది. డ్రైనేజీలు పూడిపోయి మురుగు నీరు ఏమాత్రం ప్రవహించడం లేదు. మురుగు నీటితో రోడ్లు గుంతలుగా మారాయి. చిన్న పాటి వర్షం వచ్చినా మూడు నాలుగు రోజుల పాటు నిడిచేందుకు వీలు ఉండదు.

– కొమ్ము శ్యామ్ బాబు, పాపాయపాలెం

క్లుప్తంగా

గ్రామసభల్లోని దరఖాస్తులకు సత్వర పరిష్కారం



నకరికల్లు: రీసర్వేలో సవరణల కోసం గ్రామ సభల ద్వారా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి రైతుల వెతలు తీరుస్తామని తహసీల్దార్ కె.పుల్లారావు తెలిపారు. మండలంలోని చీమలమర్రిలో రీసర్వే గ్రామభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీసర్వేలో రికార్డులలో సవరణల కోసం రైతుల నుంచి తొమ్మిది దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులు పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో రాజు, విలేజ్ సర్వేయర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంట కాలువ పరిశీలన



నార్నెపాడు(ముప్పాళ్ల): మండలంలోని నార్నెపాడులో గత కొన్నేళ్లుగా నెలకొన్న వివాదాస్పద పంట కాలువను సత్తెనపల్లి ఆర్డీఓ జీవీ రమణకాంత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన యర్రం కృష్ణారెడ్డి తన పొలానికి సాగునీరు రావటం లేదని, కాలువను పూడ్చి వేశారంటూ కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా సత్తెనపల్లి ఆర్డీఓ పొలాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. రైతు ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్వో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

తహసీల్దార్ శ్రీనివాస చక్రవర్తి



సత్తెనపల్లి: భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి అన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూములకు సంబంధించి నెలకొన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు సంబంధిత పత్రాలు తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి 41 మంది రైతులు భూ సమస్యలపై అర్జీలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బోసు బాబు, గ్రామ రెవెన్యూ అధికారి శరాబంది, గ్రామ సర్వేయర్ గోపి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో ప్రమాణాలు పాటించాలి

ఎంపీడీఓ శ్రీనివాసరావు



అచ్చంపేట: మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ కోయా శ్రీనివాసరావు సూచించాలి. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో బుధవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ పాటించాలని ఉపాధ్యాయులకు, వంట ఏజెన్సీలకు సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ వీరరాజు, హెచ్‌ఎం చిగురుపాటి కల్యాణి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని జూలకల్లు అడ్డరోడ్డులో మంగళవారం అర్ధ రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ మోహన్ వివరాలు వెల్లడించారు. మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన ఇర్లా నాగరాజు, సునిత, కుమారుడు రాజేష్ రెండేళ్ల నుంచి జీవనోపాధి కోసం రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు గ్రామంలో ఉంటున్నారు. కొడుకు రాజేష్‌తో కలిసి సునీత తన తల్లికి డ్వాక్రా డబ్బులు ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై జూలకల్లు గ్రామానికి వచ్చారు. రాజేష్(23) ఒక్కడే తిరుగు ప్రయాణం అయ్యాడు. జూలకల్లు అడ్డరోడ్డు వద్దకు రాగానే కారంపూడి నుంచి గుత్తికొండ వైపు వెళ్లే ఆటో అతని ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. రాజేష్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ మోహన్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నవంబర్ రెండు నుంచి కార్తిక మాస పూజ అభిషేకాలు

సత్తెనపల్లి: కార్తికమాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గుంటూరు రోడ్ లోని శ్రీ సనారీ వీర బ్రహ్మేంద్ర ఆశ్రమంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 2 వరకు కార్తికమాస పూజ అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ వంశపారంపర్య ధర్మకర్త పీఠాధిపతులు చింతాడ లలితాంబ మాతాజీ బుధవారం తెలిపారు. ఆశ్రమంలోని బాలా త్రిపుర సుందరి సమేత మల్లికార్జున స్వామి, భూగర్భ ద్వాదశ జ్యోతిర్లింగాలకు, మహిమాన్విత పాదరస లింగాలకు నిత్యం నమ్మక – చమక సహిత రుద్రాభిషేకాలు, గణపతి హోమం, రుద్ర హోమాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు జరుగుతాయన్నారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పూజ అభిషేకాల్లో పాల్గొనదల్చినవారు తమ గోత్రనామాలను ముందస్తుగా తెలియజేయాలని కోరారు. కార్తిక వన సమారాధనలకు ఆశ్రమంలో బిల్వ, ఉసిరి, నేరేడు, నాగమల్లి వృక్షాలతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. నవంబర్ 15న లక్ష దీపారాధన, జ్వాలా తోరణం కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. మాల ధరించిన అయ్యప్ప, శివ, భవాని, ఇతర స్వాములందరికీ ఆశ్రమంలో కార్తికమాసం నెల మొత్తం ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భిక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 94913 00312, 79899 27520 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఓటు హక్కుపై అవగాహన

నకరికల్లు: పట్టభద్రుల ఓటుహక్కు కోసం నవంబర 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె.పుల్లారావు బుధవారం సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం ఫారం–18, పాస్‌పోర్టు సైజు ఫొటో, ప్రొవిజనల్ సర్టిఫికెట్‌పై గజిటెట్ అధికారి సంతకంతో పాటు ఓటరు కార్డు, ఆధార్‌కార్డు జత చేస్తూ ఆన్‌లైన్ ద్వారా గాని ఆఫ్‌లైన్ ద్వారా గాని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే నకరికల్లు మండలంలో 375 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

బొల్లవరంలో ఫాగింగ్

బొల్లవరం(ముప్పాళ్ల): మండలంలోని బొల్లవరంలో దోమలు ప్రబలకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఫాగింగ్ చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి పి.కోటిరెడ్డి బుధవారం తెలిపారు. మురుగు కాల్వలను శుభ్రం చేసి, గ్రామంలోని అన్ని ఏరియాల్లోను పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఫాగింగ్ చర్యలు చేపట్టామన్నారు.

బైక్ మెకానిక్ మృతి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో బైక్ మెకానిక్ మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. వినుకొండకు చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బుధవారం తన స్నేహితులైన శ్యామ్‌కుమార్, ఆంజనేయులతో కలిసి చీరాల బీచ్‌కు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పెట్లూరివారిపాలెం నుంచి కోటప్పకొండకు వెళ్లేదారిలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈప్రమాదంలో రోడ్డు పక్కకు పడిన శ్రీనివాసరావుకు తలకు రాయి తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ ఎస్‌ఐ కిషోర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్య

నరసరావుపేటటౌన్: రైలు క్రింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. క్రిష్టియన్ పాలెం వద్ద అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు క్రింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు నాయక్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పడి ఉన్న ఆనవాళ్లను బట్టి ఆత్మహత్య చేసుకుని ఉంటా డని భావిస్తున్నారు. మృతుడు నలుపు రంగు గళ్ల చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్య శాలకు తరలించారు. మృతుడి వద్ద విజయవాడ నుంచి నరసరావుపేట రైల్వే టికెట్ లభ్యమైంది.

అమరవీరుల త్యాగాలు మరువలేం



పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన అమరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ సంధ్యారాణి



పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ..

సత్తెనపల్లి: పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని సత్తెనపల్లిటౌన్ ఎస్‌ఐ ఎం.సంధ్యారాణి అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీ లక్ష్మీ థియేటర్‌లో రజనీకాంత్ నటించిన పోలీస్ యాక్షన్ సినిమా వేట్టయన్ విద్యార్థులకు ఉచితంగా ప్రదర్శించారు. అలాగే పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసుల విధులు, రికార్డుల నిర్వహణ, తదితర వాటిపై శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ.సంధ్యారాణి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలు అజరామరమన్నారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసులకు నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మౌనం పాటించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాముల విగ్రహం తొలగింపు

అమరావతి: మండల కేంద్రమైన అమరావతిలో సుమారు 30 ఏళ్ల క్రితం గాంధీబొమ్మ సెంటర్‌లో అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహాన్ని అమరావతి ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ఈక్రమంలో 2016 పుష్కరాలకు రోడ్డు వెడల్పులో భాగంగా పొట్టి శ్రీరాముల విగ్రహాన్ని తొలగించి గ్రామ కచేరి ఆవరణలో ఉంచారు. సుమారు ఆరేళ్ల పాటు విగ్రహాన్ని అక్కడే వదిలేశారు. కొద్దికాలం క్రితం గ్రామానికి చెందిన కొంతమంది ఆర్యవైశ్యులు అదే విగ్రహాన్ని స్థానిక పోస్టాఫీస్ పక్కన కన్యకాపరమేశ్వరిదేవి పాలయ ముఖ ద్వారం ప్రక్కనే ప్రతిష్ఠించారు. ఈనేపథ్యంలో బుధవారం పొట్టిశ్రీరాముల విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తొలగించి ముక్కలుగా పడేశారు. ఘటనపై ఆర్యవైశ్య సంఘం, కన్యకాపరమేశ్వరిదేవస్థానం పాలకమండలి ప్రతినిధులు మాట్లాడుతూ పాత విగ్రహం పూర్తిగా శిథిలమైందని, గాంధీబొమ్మ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన వేదికపై నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించామన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతాం

జిల్లా కలెక్టర్, ఎన్‌టీఆర్ సమన్వయకర్తలకు వైద్యమిత్రల వెల్లడి



ఎన్‌టీఆర్ సమన్వయకర్త చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 29వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు పల్నాడు జిల్లా వైద్యమిత్ర అసోసియేషన్ నాయకులు చెప్పారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎన్‌టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త జి.చంద్రశేఖర్‌ను కలిసి సమ్మె వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా వైద్యమిత్రలుగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఒక క్యాడెర్ అంటూ లేదని, ప్రస్తుతం మాకు ఇస్తున్న జీతం రూ. 15 వేలు మాత్రమేనన్నారు. తమకు ఎటువంటి సంక్షేమ పథకాలు కూడా లభించడం లేదని, ఎన్నిసార్లు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెలోకి వెళ్తున్నట్లు చెప్పారు. మా 17 ఏళ్ల కాలాన్ని పరిగణలోకి తీసుకొని వైద్యమిత్రాలను కాంట్రాక్టు విధానంలోకి మార్చి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు సాయిబాబురాజు, ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.అప్పారావు, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, జిల్లా సెక్రెటరీ శివ నాగేశ్వరరావు, సహ కార్యదర్శి సింగంశెట్టి వెంకటేశ్వర్లు, ట్రెజరీ అశోక్ పాల్గొన్నారు.

బ్లడ్ సెంటర్‌లో సర్వమత ప్రార్థనలు



నరసరావుపేట: స్థానిక 200పడకల ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ప్రారంభం కాబోతున్న రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రెడ్‌క్రాస్ ఛైర్మన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు బుధవారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చేనెల 10వ తేదీన బ్లడ్ బ్యాంక్ సెంటర్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ప్రజాప్రతినిధులు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు.వైస్ ఛైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి గంద్రకోట మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ డాక్టర్ సృజన, డాక్టర్ రహమతుల్లా, సభ్యులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, జెల్లీ వీరారెడ్డి, జీవీఎస్ రాము, యస్.కె. జిలానీమాలిక్, బ్లడ్ సెంటర్ వైద్య అధికారులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ రంగారావు, ఆర్‌ఎంవో ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆహారంలో నాణ్యత లేదు..

- జడ్జికి హాస్టల్‌లో విద్యార్థుల ఫిర్యాదు
- హాస్టల్ తనిఖీ చేసిన న్యాయమూర్తి



సెల్‌ఫోన్ కాంతిలో ఆహారం రుచి చూస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగశ్రీనివాసరావు

సత్తెనపల్లి: హాస్టల్ భోజనం నాణ్యత లేదని, దోమలు అధికంగా ఉన్నాయని బీసీ సంక్షేమ మహిళా హాస్టల్ విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని బీసీ సంక్షేమ మహిళా హాస్టల్‌లో (కాలేజీ స్థాయి) సత్తెనపల్లి సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్ సీహెచ్ వెంకటనాగశ్రీనివాసరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత హాస్టల్ పరిసరాలను నిశితంగా పరిశీలించారు. అక్కడ ఉన్న విద్యార్థినులను అడిగి వారికి అందుతున్న సదుపాయాలను, నాణ్యత కలిగిన ఆహార పదార్థాలను అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అంతేగాక న్యాయమూర్తి వెళ్లిన కొంత సమయానికి విద్యుత్ కోత వలన విద్యుత్‌కు అంతరాయం కలగటంతో సెల్‌ఫోన్ లైట్ కాంతిలో అక్కడ ఉన్న ఆహార పదార్థాలను తిని సక్రమంగా ఉన్నాయా ? లేవా? అని రుచి చూశారు. అక్కడ ఉన్న పరిసరాలు, బాత్ రూమ్‌లన్నింటిని క్షుణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభానీ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం బూత్ లెవల్ అధికారులు(బీఎల్వోలు)తో సమావేశం నిర్వహించారు. కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. 2021 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తి అయిన వారు అర్హులని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటు నమోదు చేయించుకోవాలని కోరారు. డిగ్రీ ఉత్తీర్ణత సర్టిఫికెట్‌పై గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ సంతకం చేయించి అందించాలన్నారు. దరఖాస్తు చేయడానికి నవంబర్ 6 వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. బీఎల్‌వో లు ఫారం–18 పై అవగాహన కల్పించి పట్టభద్రులతో దరఖాస్తు చేయించాలని సూచించారు.

ప్రభుత్వ వైద్యసేవలను వినియోగించుకోవాలి



అమరావతి: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ప్రజలందరికీ అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని డీఎంహెచ్‌ఓ బి.రవి కోరారు. బుధవారం మండల పరిధిలోని అత్తలూరు పీహెచ్‌సీని సాధారణ తనిఖీలలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లల టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్ డీప్ ఫ్రిజ్‌లను తనిఖీ చేశారు. అనంతరం అంశాల పనితీరుపై సమీక్షించారు. ఆయన వెంట జిల్లా నోడల్ అధికారి డి.హనుమకుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ పాల్గొన్నారు.

రోగులకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి

అచ్చంపేట: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాలలో జ్వర పీడితుల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వైద్య సేవలను అందించాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.రవి సూచించారు. స్థానిక పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్యసిబ్బందితో మాట్లాడారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండే విధంగా గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వ్యాధులు ఎక్కువగా ఉండే గ్రామాలలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో జరిగే కార్యక్రమాలు, అమలవుతున్న విధానాలపై వైద్యులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ ఇన్నారావులతో చర్చించారు. సిబ్బంది హాజరు పట్టీలను, స్టాక్ రిజిష్టర్స్, రికార్డులను తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా జరిగేటట్లు ప్లాన్ చేసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో మురుగు చేరకుండా గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫీవర్ సర్వే, లార్వా సర్వేలను ఇంటింటికి నిర్వహించాలని కోరారు. వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది



నార్నెపాడులో పొలంపిలుస్తొంది కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ అరుణ

నార్నెపాడు(ముప్పాళ్ల): గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ ఎం.అరుణ మాట్లాడుతూ పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు, అధిక వర్షాల నుంచి పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని కోరారు. ఆజోస్పిల్లమ్, పొటాష్ రిలీజింగ్ బ్యాక్టీరియా వాడటం వలన 40 శాతం ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సహాయకులు కె.ప్రియాంక, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చౌటపాపాయపాలెంలో..

రాజుపాలెం: మండలంలోని చౌటపాపాయపాలెంలోని వరి పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వరి పైరులో పాము పొడ తెగులు ఉన్నట్లు గుర్తించామని మండల వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య తెలిపారు. దీని నివారణకు వరిపైరు చుట్టూ ఉన్న గట్టులపై ఉన్న గడ్డిని తొలగించాలని, గట్టులను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. శిలీంధ్ర నాశిక మందులైన కాంటాఫ్‌ప్లెస్ ఎకరాకు 400 మిల్లీలీటర్లు పిచికారీ చేస్తే తెగుల ఉధృతిని తగ్గించవచ్చని తెలిపారు. దోమ నివారణ, ఆకుచుట్టు పురుగు నివారణ గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎన్.సైదుబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలి

బాలల హక్కుల పరిరక్షణ నిర్వహణ కమిటీ సభ్యురాలు పద్మావతి



పద్మావతికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

చిలకలూరిపేట: ఉపాధ్యాయులు విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి సత్వర పరిష్కారం చూపాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ నిర్వహణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. మండలంలోని పోతవరం గ్రామంలో ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్న విషయం తెలుసుకొని డీఎంహెచ్‌ఓకు ఫోన్ చేసి ప్రతి నెలా విద్యాలయంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలోని శారదా జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఆమెతో మాట్లాడుతూ క్రమశిక్షణా చర్యల పేరున టీసీలు ఇచ్చి పంపుతున్నారని ఫిర్యాదు చేశారు. ఆమె ఉపాధ్యాయుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంట సీడీపీవో శాంతకుమారి ఉన్నారు.